

కడియం : శ్రీసత్యదేవా నర్సరీలో సంక్రాంతి శోభ

కోడి పందేలకు బరులు సిద్ధం

- పోలీసుల ఆదేశాలు బేఖాతరు
- అధికార పార్టీ నేతల అనుమతికి నిరీక్షణ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

సంక్రాంతి సంబరాలు చాటున కోడి పందేల నిర్వహణకు జిల్లావ్యాప్తంగా బరులు సిద్ధమవుతున్నాయి. కోర్టు ఆదేశాల నేపథ్యంలో పందేలు, గుండాట ఇతర జూద క్రీడలకు అనుమతులు ఇవ్వబోమని జిల్లా ఎస్‌పి జగదీష్ ఇప్పటికే స్పష్టం చేసిన విషయం విదితమే. అయితే అధికార పార్టీ నేతల అండదండలతో ప్రతి నియోజక వర్గంలోనూ బరులు సిద్ధమవుతున్నాయి. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగి కొన్ని బరులను ధ్వంసం చేసినప్పటికీ నిర్వాహకులు వెనకడుగు వేయడం లేదు. అధికార నేతల అనుమతుల కోసం ఎదురు చూస్తున్నారు. నేటి నుంచి మూడు రోజుల పాటు పందేలు నిర్వహించేందుకు సమాయత్తం అవుతున్నారు. గోదావరి జిల్లాలో కోడి పందేల పేరుతో రూ.కోట్లలో చేతులు మారుతుంటాయి. కత్తులతో వేసే కోడి పందేలతో పాటు గుండాట, కత్తులు లేకుండా నిర్వహించే డింకీ పందేలు పెద్ద ఎత్తున జరుగుతుంటాయి. ఈ పోటీల కోసం కోళ్లకు ప్రత్యేక శిక్షణ, ఆహారం ఇచ్చి పెంపంకందారులు ఇప్పటికే సొమ్ము చేసుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్నాటక, తమిళనాడు నుంచి జిల్లాకు సంక్రాంతి రోజుల్లో పెద్ద ఎత్తున పందెం రాయుళ్లు రానున్నట్లు సమాచారం. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారితో హోటల్స్‌లో రద్దీ నెలకొంది. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో ఇప్పటికే హోటల్స్ పూర్తిగా ఫుల్ అయ్యాయి. సంక్రాంతి సంబరాలు ఈసారి భారీస్థాయిలో ఉంటాయని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. అతిథులకు కావల్సిన వసతి సౌకర్యాలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అదేవిధంగా బరులపై ముందస్తు సమాచారం ఇస్తున్నారు. హోమ్ మినిస్టర్ తానేటి వనిత నియోజకవర్గమైన కొవ్వూరులో విస్తృతంగా బరులు ఏర్పాటవుతున్నాయి. ఔరంగాబాద్, పంగిడి, పసివేదల, ఆరికరేవుల, కుమార దేవం, తోగుమ్మిలో బరులు సిద్ధం అయ్యాయి. నిడదవోలు నియోజకవర్గంలో డి.ముప్పవరం నుంచి గోపవరం వెళ్లే రోడ్డులో అధికారపార్టీకి చెందిన నేతల కనుసన్నల్లో బరులు సిద్ధమవుతున్నాయి. కొబ్బరితోటల్లో మట్టిని చదును చేసి బరులు సిద్ధం చేశారు. అధికార పార్టీ నేతల నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే అప్పటికప్పుడు బరుల చుట్టూ ఫెన్సింగ్, లైటింగ్, టెంట్లు ఏర్పాటు చేసి ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నారు. నల్లజర్ల మండల శివారు భారత్ పెట్రోల్ బంక్ పక్కన ఖాళీ స్థలంలో కోడి పందేలకు బరి సిద్ధం చేశారు. అనపర్తి, రాజమండ్రి రూరల్, రాజానగరం నియోజక వర్గాల్లోనూ అక్కడక్కడా బరులు సిద్ధమవుతున్నాయి. కోడి పందాలూ అధికార పార్టీ నేతలు కాసులు కురిపిస్తున్నాయి. గతంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే వారి అనుయాయులు నిర్వహించేవారు. తాజాగా తరతమ బేధం లేకుండా సొమ్ములు చెల్లిస్తే ఎవరికైనా పందేలు వేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీస్ రెవెన్యూ శాఖాధికారులు గ్రామాల్లో సభలు పెట్టి హెచ్చరికలు జారీ చేసినా బరులు సిద్ధమవడంతో కొరడా ఝుళిపించారు. ప్రతి నియోజకవర్గంలోనూ కొన్ని బరులను ధ్వంసం చేశారు. అయినా నిర్వాహకులు వెనకడుగు వేయడంలేదు తిరిగి ప్రారంభించేలా బరులను సిద్ధం చేస్తున్నారు.

నల్లజర్ల శివారు పెట్రోల్ బంక్ పక్కన సిద్ధమవుతున్న కోడిపందేల బరి

పలుచోట్ల పందేల బరులు ధ్వంసం

ఎస్‌పి పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీస్‌శాఖ, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా పలు ప్రదేశాల్లో కోడి పందేలకు చేసిన ఏర్పాట్లను, బరులను ధ్వంసం చేశారు. కోడిపందేలు, జూదాలు, గుండాట ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పలుచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పలు గ్రామాలో కోడిపందేల నిర్వహణకు సిద్ధం చేసిన బరులను ట్రాక్టర్లతో ధ్వంసం చేయించారు. సంక్రాంతి సందర్భంగా ఎటువంటి జూద క్రీడలు నిర్వహించవద్దని, కోడిపందేలను ప్రోత్సహించవద్దని, కోడి పందేల కోసం బరులు ఇచ్చినా, నిర్వహించినా, పాల్గొన్నా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

బొమ్మూరు పోలీస్ స్టేషన్ పరిధిలో డిఎస్‌పి కిషోర్ కుమార్, సిఐ ఆర్.విజయ్ కుమార్ తమ పరిధిలో సాటిలైట్ సిటీలో కోడిపందేలు వేసేందుకు తయారు చేస్తున్న బరుల వద్దకు వెళ్లి ఏర్పాట్లను అడ్డుకున్నారు. కడియం పోలీస్ స్టేషన్ పరిధిలో డిఎస్‌పి కె.శ్రీనివాసరావు, సిఐ తిలక్ వీరవరంలో కోడిపందేల కోసం ఏర్పాటు చేసిన టెంట్లను తొలగించారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో డిఎస్‌పి విజయ పాల్, సిఐ వీరయ్య గౌడ్‌తో కలిసి కోడిపందేలు జరిగే ప్రదేశాల వద్ద తనిఖీలు నిర్వహించారు. నల్లజర్లలో సిఐ దుర్గాప్రసాద్ తమ పరిధిలో కోడి పందేలు నిర్వహించే ప్రదేశాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ వేళ్ల చింతలగూడెంలో తనిఖీలు నిర్వహించి, బరులను ధ్వంసం చేశారు. కోరుకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ శారద సతీష్ కోడిపందేల బరులను ధ్వంసం చేశారు. నిడదవోలులోని సింగవరంలో ఎస్ఐ పందేల టెంట్లను తొలగించారు.

ఓటు అడిగే హక్కు టిడిపికి లేదు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాష్ట్ర ఖజానాను పూర్తిగా దోచేసి, రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచిన టిడిపి, చంద్రబాబు ఏ ముఖం పెట్టుకుని ఓట్ల కోసం ప్రజల వద్దకు వస్తారని ఎంపీ మార్గాని భరత్ రామ్ ప్రశ్నించారు. శనివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ మాట్లాడారు. బాబు వస్తే చిన్నబాబు లోకేష్‌కు మంత్రి పదవి గ్యారంటీ అయింది కానీ నిరుద్యోగ యువతకు ఒక్క జాబ్ ఇవ్వలేదన్నారు. బాబు వస్తే భవిష్యత్తు గ్యారంటీ మాట దేవుడెరుగు..రాష్ట్రం మాత్రం దివాళా తీయడం గ్యారంటీ అన్నారు. 2014 ఎన్నికలలో 640 హామీలిచ్చారని, వాటిలో ఎన్ని అమలు చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. మేనిఫెస్టో అంటే రాజకీయ పార్టీలకు పవిత్ర గ్రంథంగా భావించాలే తప్ప ప్రజలను మోసం చేసేందుకు ఉపయోగించే ఎర కాకూడదన్నారు. 2019లో వైఎస్.జగన్ ఏ హామీలిచ్చారో వాటన్నిటినీ అమలు చేయడమే కాకుండా.. ఇంకా ఎక్కువ అభివద్ధి పనులు చేసి ప్రజాభిమానం చూరగొన్నారని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్

ఎంపీ భరత్ వ్యాఖ్యలకు ఆదిరెడ్డి ఖండన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాజకీయాల గురించి మాట్లాడు, అభివృద్ధి గురించి మాట్లాడు .. అంతేగానీ మా వ్యాపారాల సంగతి ఎందుకని ఎంపీ భరత్‌ను ఉద్దేశించి మాజీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి అప్పారావు వ్యాఖ్యానించారు. హోటల్ జగదీశ్వరిలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను రూ.3 వడ్డీలు వసూలు చేస్తున్నట్లు నిరూపిస్తే వ్యాపారం మూసేస్తామని సవాల్ విసిరారు. తమ జోలికొస్తే ఎంపీ వ్యవహారాల సంగతి బయట పెడతామని ఆయన హెచ్చరించారు. నీతిగా వ్యాపారం చేస్తూ అందరి దగ్గరా మంచి పేరు తెచ్చుకుంటున్నామని చెప్పారు. ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదన్నారు. తాను సైకిల్ తొక్కానని, రూ.500కు లెక్చరర్‌గా ఉద్యోగం చేశాను, వ్యాపారం ప్రారంభించి నీతిగా చేసుకుంటూ వస్తున్నానని చెప్పారు. ఎంఎల్‌సిగా నగరాభివృద్ధి కోసం ఎన్నో నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేయించానన్నారు. తాను మంజూరు చేయించిన పనులు కూడా ఎంపీ భరత్ పూర్తిచేయించలేకపోయారని చెప్పారు. జనసేన పార్టీ నగర ఇన్‌ఛార్జ్ అత్తి సత్యనారాయణ మాట్లాడుతూ ఎంపీ భరత్‌కు పది ప్రశ్నలు సంధించారు. ఈ సమావేశంలో టిడిపి నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, శెట్టి జగదీష్, మాలే విజయలక్ష్మి, మీసాల నాగమణి, ఇన్నమూరి రాంబాబు, మిస్కా జోగినాయుడు, చాపల చిన్న రాజు, రుంకాని విజయ్, బేసరి చిన్ని, మేడికొండ అప్పారావు, సత్యనారాయణ, నల్లంశెట్టి వీరబాబు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి -దేవరపల్లి, తాళ్లపూడి

మత్తు పదార్థాలు మాదకద్రవ్యాలను అరికట్టాలని డివైఎఫ్ఐ సిఐటియు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించడం అభినందనీయమని త్యాగంపూడి ఉపసర్పంచ్ సతీష్ అన్నారు. దేవరపల్లిలో జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్లో డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో 9వ సంక్రాంతి సంబరాలను ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా క్రీడలు నిర్వహించడం ద్వారా యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా నిరోధించవచ్చన్నారు. కోడిపందేలు, జూదాలను యువత వ్యతిరేకించాలని సూచించారు. డివైఎఫ్ఐ జిల్లా నాయకులు గారపాటి ప్రసన్న కృష్ణ మాట్లాడుతూ మద్యం మత్తు, మందుల ప్రభావం యువతపై తీవ్ర ప్రభావం చూపిస్తోందని, వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, క్రీడలు జయప్రదం అవ్వాలని ఆకాంక్షించారు. వాలీబాల్ సీనియర్స్, కబడ్డీ జూనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయులు బుజ్జిబాబు ఎంపైర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ గ్రామ కమిటీ అధ్యక్షుడు గట్టం నాని, కార్యదర్శి కొత్తపల్లి తాతారావు, డివైఎఫ్ఐ నాయకులు పరపతి సోమశేఖర్, మెరిపే సతీష్, గట్టెం కృష్ణమోహన్, సిద్ధంశెట్టి శ్రీను, సిఐటియు మండల కార్యదర్శి ఎస్.భగత్ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు

దేవరపల్లిలో పోటీలను ప్రారంభిస్తున్న సతీష్

తాళ్లపూడి మండలం వేగేశ్వరపురంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, భోగి మంటలు హరిదాసు కీర్తనలు, ఆటపాటలు సచివాలయ ప్రాంగణంలో నిర్వహించారు. పంచాయితీ కార్యదర్శి డి.శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగిన ఈ సంబరాల్లో సచివాలయ కార్యదర్శి నాగాంజనేయులు, సచివాలయం సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

తాళ్లపూడి వేగేశ్వరపురంలో సంక్రాంతి సంబరాలు

కలెక్టర్ సంక్రాంతి శుభాకాంక్షలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

దక్షిణ భారత దేశ ప్రాంతాలలో జరుపుకునే అతి పెద్ద పండగ సంక్రాంతి అని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, సిబ్బందికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియ చేశారు. ప్రతి ఇంటా సిరులు కురిపించాలని, ఆరోగ్యం ఆనందాలు వెదజల్లాలని అభిలాష వ్యక్తం చేస్తూ కలెక్టర్ శుభాకాంక్షలు తెలియ చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు కారణంగా ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం జనవరి 15వ తేదీ నిర్వహించడం లేదని ఆ ప్రకటనలో వెల్లడించారు.

షర్మిళరెడ్డిని అభినందిస్తున్న హౌసింగ్ అధికారులు

షర్మిళరెడ్డికి పలువురి అభినందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఎపి హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా మేడపాటి షర్మిళరెడ్డి నియమితులైన సందర్భంగా జిల్లా హౌసింగ్ అధికారి జి.పరశురామ్ ఆధ్వర్యంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా షర్మిళరెడ్డి మాట్లాడుతూ, జిల్లాను హౌసింగ్ నిర్మాణాల పరిధిలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిపేందుకు సమన్వయంతో కలిసి పని చేయాలని సూచించారు. అభినందనలు తెలిపిన వారిలో హౌసింగ్ ఇఇలు రాజ్ కుమార్, డిఇలు బివివి.సత్యనారాయణ మూర్తి, చంద్రశేఖర్, సిహెచ్.వేణుగోపాల్, ఆర్.వెంకటేశ్వర బాబు, ఎం.శ్రీనివాస్, కె.శేఖర్‌బాబు, ఎఇ కెఎస్.చక్రవర్తి తదితరులు ఉన్నారు.

సత్యదేవా నర్సరీలో మాజీ ఎంపీ మురళీ మోహన్

ప్రజాశక్తి-కడియం

సినీ నటుడు, రాజమండ్రి మాజీ ఎంపీ మాగుంట మురళీ మోహన్ శనివారం శ్రీ సత్యదేవా నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు ఆయనకు ఒక మొక్కను అందజేసి ఆహ్వానం పలికారు. ఇంపోర్టెడ్ చైనా ఆరంజ్ మొక్కను గురించి, వివిధ రకాల ఆర్నమెంటల్ మొక్కల గురించి మురళీ మోహన్ అడిగి తెలుసుకున్నారు. సంక్రాంతి కూర్పుకి వాడిన మొక్కల గురించి పుల్లా రాజశేఖర్, పుల్లా వీరబాబులు ఆయనకు వివరించారు. ఆయన వెంట కడియం ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, తదితరులున్నారు.

33వ రోజు అంగన్‌వాడీల సమ్మె

అంగన్‌వాడీల సమ్మె శనివారం 33వ రోజుకు చేరింది. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేంది లేదని వారు స్పష్టం చేశారు. ఎస్మా చట్టం ప్రతులు, నోటీసులు భోగి మంటల్లో తగేస్తామని హెచ్చరించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం సబ్ కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడారు. 33 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఆరుసార్లు చర్చలకు పిలిచి పాత పాటే పాడుతోందనిన్నారు. జీతాల పెంపు విషయంలో మీన మేషాలు లెక్కిస్తూ జీతాలు పెంచుతాం కానీ ఎప్పుడు పెంచుతామో ఎంత పెంచుతామో చెప్పమని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల ముందు అక్క చెల్లెమ్మలంటూ నెత్తి మీద చేయి వేసిన జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అక్క చెల్లెమ్మలైన అంగన్వాడీ రోడ్డు పాలు చేశారన్నారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.జేబీరాణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ మాట్లాడుతూ నేటి నుంచి జగనన్నకు చెబుదాం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ చేపడుతున్నామని, రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల మీద ప్రయోగించిన ఎస్మా చట్టం జిఒను, అంగన్వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన నోటీసులను భోగిమంటల్లో తగలేస్తామని హెచ్చరించారు. పండగ లోపు ప్రభుత్వం వేతనాలు పెంచకపోతే నిరవధిక దీక్షలకు పూనుకుంటామని, అవసరమైతే అన్ని కార్మిక సంఘాలు ప్రజాసంఘాలు రాజకీయ పార్టీల మద్దతుతో రాష్ట్ర బందుకు పిలుపునిస్తామని హెచ్చరించారు. టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, జిల్లా అధ్యక్షుడు వై.ధర్మరాజుతో కూడిన బందం సమ్మె శిబిరానికి వచ్చి తమ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు, రాజమండ్రి నగర కార్యదర్శి బి.పవన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్.మూర్తి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జయకర్, ఎ.షరీఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్, ఎన్.రాజా, అంగన్వాడీ యూనియన్ నేతలు జె.సునీత, సుబ్బలక్ష్మి, రామలక్ష్మి, మాలతి, కృష్ణవేణి, సూర్యవతి, దుర్గాంబ, సుజాత, మరియమ్మ, పిపి.లక్ష్మి, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడు రఘురామరాజు

గోకవరంలో..

కోరుకొండ కాపవరం జంక్షన్ సమీపంలో అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని యుటిఎఫ్ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె న్యాయమైనదన్నారు. వారిపట్ల రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి సరైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎం భాస్కర్, జివి.శివబాబు, పి.లోవ రాజేష్, జిఎస్.సుబ్రహ్మణ్యం, అంకం సత్యనారాయణ, టి.సత్యనారాయణ, టివి.భగవానులు, కె.వీరబాబు, బి.బాపూజీ, సిహెచ్.శ్రీనివాస్ రావు దొర, జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చాగల్లు తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె కొనసాగింది. అధిక సంఖ్యలో అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు

పెరవలి తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి కె.కృష్ణవేణి, బి.నాగవేణి, సిహెచ్.విశాలి, వి.నిర్మల, కన్యాకుమారి, ఎస్.రాణి, ఎన్.శాంత కుమారి, బి.రామలక్ష్మి, పి.దుర్గాలక్ష్మి పాల్గొన్నారు.

గోపాలపురం సిఐటియు జిల్లా నాయకులు సుందర్ బాబు, మండల అధ్యక్షురాలు రామలక్ష్మి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

చాగల్లులో..

పెరవలిలో ఒంటి కాలిపై నిరసన



నూతన యూనిఫారంతో పంచాయతీ సిబ్బంది

కార్మికులకు యూనిఫారం పంపిణీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వేలివెన్ను, కాల్దారి గ్రామపంచాయతీల కార్మికులకు యూనిఫారం దుస్తులను పంపిణీ చేసినట్లు వేలివెన్ను సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ తెలిపారు. తెలుగు ప్రజలకు, రైతులకు ముఖ్యమైన పెద్ద పండుగ సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని, గ్రామాల్లో పని చేస్తున్న పారిశుధ్య సిబ్బందికి నూతన దుస్తులను అందించాలనే ఉద్దేశంతో పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శి ఎ.శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు, జూదాలపై కఠిన చర్యలు

సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందేలు, జూలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. శనివారం పలుచోట్ల పందేలకు ఏరాటు చేస్తున్నా బరులను వారు ధ్వంసం చేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉండ్రాజవరం ఎస్ఐ వి.అప్పలరాజు మండలంలోని పలు ప్రదేశాలలో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశారు. పందేలు, జూదాలపై సమాచారం తెలిస్తే తన ఫోన్ నుంబరు 9440796643కు తెలియజేయాలని ఆయన కోరారు. **గోపాలపురం** మండలం పరిధిలోని కోడిపందాల బరులలను ఎస్ఐ కె.సతీష్‌కుమార్, రెవెన్యూ అధికారులు జెసిబి, ట్రాక్టర్లతో ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో డిటి కృష్ణ, ఎఎస్ఐ శోభనాద్రి సిబ్బంది పాల్గొన్నారు. **దేవరపల్లి** మండలంలో కోడిపందాల బరులను ఎస్ఐ కె.శ్రీహరిరావు ధ్వంసం చేశారు. పందేల నిర్వహణకు భూములు ఇచ్చిన యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ట్రైనీ డిఎస్‌పి భానోదయ పాల్గొన్నారు. **నల్లజర్ల** పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ దుర్గ ప్రసాద్ మాట్లాడారు. సాంప్రదాయమైన కార్యకలాపాలతో పండుగను జరుపుకోవాలని సూచించారు. తహశీల్దారు వి.కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

నల్లజర్లలో బరిని తొలగిస్తున్న పోలీసులు

నేరాలు ఘోరాలు

యానాం మద్యం పట్టివేత

ప్రజాశక్తి - ఐ.పోలవరం

యానాం నుంచి గుంటూరుకు కారులో మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శనివారం తెల్లవారు జామున పోలీసులు పట్టుకొన్నారు. వివరాలు ఇవి.. పాతఇంజరం-ఎదుర్లంక చెక్ పోస్టు వద్ద యానాం నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేస్తుండగా 348 బాటిల్స్ పట్టుకొన్నారు. ఇవి రూ.1.48 లక్షలు విలువచేస్తాయని ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపారు. శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాట్రేనికోన మండల పరిధిలోని మత్స్యకార గ్రామమైన పల్లంలో యానాం మద్యం విక్రయిస్తున్న మల్లాడి వెంకట్రావు అలియాస్ సత్తియను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. అతని నుంచి 254 యానాం మద్యం బాటిల్స్ ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సారా విక్రయం కేసులో ఇద్దరికి రిమాండ్

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

స్థానిక కమ్మిరి వీధిలో 20 లీటర్ల నాటు సారాతో పట్టుబడిన ఇద్దరు మహిళలకు కాకినాడ ఎక్సైజ్ కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ సిఐ కె.రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో శనివారం సామర్లకోట కమ్మిరి వీధిలో నాటుసారా విక్రయాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటు సారా విక్రయిస్తున్న గుబ్బల పార్వతి, గుబ్బల వీరదు మ్మలను అదుపులోకి తీసుకుని వారి నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని కోర్టులో ప్రవేశపెట్టగా ఇరువురికి 14 రోజులు రిమాండ్ ను కోర్టు విధించింది. అలాగే నాటు సారాను సరఫరా చేస్తున్న అదే ప్రాంతానికి చెందిన దంగేటి రాజు అనే వ్యక్తిపైనా ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అంతర్జాతీయ సదస్సుకు కాకినాడ ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - కాకినాడ

కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వ ఎర్త్ సైన్సెస్ సం యుక్తంగా నిర్వహిస్తున్న ఇండి యా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టి వల్ కు కాకినాడ గోడరిగుంట మదర్ థెరీసా మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న కెఆర్ఎస్.చంద్రారెడ్డికి ఆహ్వానం అందింది. జీవశాస్త్ర బోధనలో నూతన పోకడలు అనే అంశం పై పరిశోధన పత్రాన్ని ఈ సదస్సులో సమర్పిస్తారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఈ నెల 17 నుంచి 20 వరకూ జరగనున్న ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ దేశ విదేశాల శాస్త్రవేత్తలతో పాటు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడి పాల్గొంటారు. ఎంపికైనా ఉపాధ్యాయుడు కెఆర్ఎస్. చంద్రారెడ్డిని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యా శాఖాధికారి జి.నాగమణి, అదనపు సంయుక్త సంచాలకులు, విద్యాశాఖ పి.నాగేశ్వరరావు, కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జె.డేనియల్ రాజు, జిల్లా సైన్స్ అధికారి ఎమ్.శ్రీనివాస్ వినీల్, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు ఎంఇఒలు విపిజి. వాణీ కుమారి, సిహెచ్.రవి, పాఠశాల హెచ్ఎం వై.శ్రీనివాస్ అభినందించారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - కోటనందూరు, రౌతులపూడి, కాజులూరు

సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు, గుండాట, ఇతర జూదాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ బి.శంకర్రావు హెచ్చరించారు. సంక్రాంతి సందర్భంగా ఊరి విడిచి వెళ్లేవారు ఇంటిని భద్రపరుచుకోవడం కోసం తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. 17 గ్రామపంచాయతీ లోనూ ఆటో ద్వారా ప్రసారం నిర్వహించడం జరిగిందని తెలిపారు. అలాగే రౌతులపూడి మండలంలో సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో ఎక్కడైనా కోడిపం దాలు, ఇతర జూదాలను నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ అబ్దుల్ నబీ శనివారం హెచ్చరించారు. మండలం లోని 26 గ్రామపం చాయతీలో ఆటో ద్వారా ప్రసారం నిర్వహిం చారు. నిబం ధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాజులూరు మండలంలో సంక్రాంతి పండుగను పురష్కరించుకుని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహశీల్దార్ బి.సాయి సత్యనారాయణ హెచ్చరించారు. శనివారం మండలం లోని గొల్లపాలెం, ఆర్యవటం, జగన్నాధగిరి, కాజులూరు గ్రామాల్లో గతంలో కోడిపందాలు జూదాలు నిర్వహిం చిన ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తులసీరామ్‌చ రెవిన్యూ అధికారులు ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుకల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యార్థులు పెద్దాపురం మండలం జె.తిమ్మాపురం గ్రామంలో గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా శనివారం రైతులకు ఎలుకల నివారణ పై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎస్.అలీసియా నర్మీన్, ఎస్‌కె.బీబీ ఫాతిమా, ఆర్.దీప్తిరాణి, జి.లక్ష్మీతులసి, వి.లహరిలతో కూడిన బృందం ఎలుకల నివారణ మందు తయారీ, వాటిని వినియోగించే పద్ధతి తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. బ్రోమోడయోలోన్, వంటనూనె, వరి నూకలను 2 : 2: 96 నిష్పత్తిలో కలిపి 10 నుంచి 15 గ్రాముల మిశ్రమాన్ని చిన్న చిన్న పొట్లాలు కట్టి ఎలుకల బొరియల వద్ద పెడితే ఎలుకలు వాటిని తిని మరణిస్తాయన్నారు.

పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాలు, నగదు పంపిణీ

ప్రజాశక్తి-రామచంద్రపురం

సంక్రాంతి సందర్భంగా వెంక టాయపాలెం గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు గ్రామ నౌకరులకు జనసేన ఎంపిటిసి సభ్యురాలు కణితి వెంకటేశ్వరి రాంబాబు ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు నగదు, గాజు గ్లాసులను పంపిణీ చేశారు. సంక్రాంతి సందర్భంగా జనసేన పార్టీ పిలుపులో భాగంగా వీటిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పోతాబత్తుల విజయ కుమార్, పార్టీ గ్రామ అధ్యక్షులు మంచం పాపారావు, నాని, గంధం ఉమా శంకర్, పెద్దిరెడ్డి దొరబాబు తదితరులు పాల్గొన్నారు. జనసేన పార్టీ నాయకులకు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీలకు సంక్రాంతి ఏదీ..

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అంగన్‌వాడీలకు సంక్రాంతి పండుగ సందడి లేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలపై ఎస్మా విధించడం పట్ల సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, తమ సమస్యలను పరిష్కరించాలని 33 రోజులుగా అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మెబాట పట్టిన విషయం విదితమే. జిల్లావ్యాప్తంగా వేలాది మంది అంగన్‌వాడీ కుటుంబాలు క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలకు సైతం దూరమై వీధుల్లో తమ నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం కనీసం ఆలోచన చేయకపోవడం నియంతృత్వ వైఖరిని దర్పణం పట్టింది. అత్యవసర సర్వీసుల పరిధిలోకి తీసుకొచ్చి ఎస్మా ప్రయోగించడం చట్టవిరుద్ధమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలుగుదేశం ప్రభుత్వం గతంలో అంగన్‌వాడీ ఉద్యమం పట్ల అనుచితంగా వ్యవహరించిన విషయం విదితమే. గుర్రాలతో తొక్కించడం ద్వారా ఉద్యమాన్ని చల్లార్చాలనుకున్న ప్రభుత్వం ... ఈ నేపథ్యంలో టిడిపి దాదాపు పదేళ్ల అధికారానికి దూరమైంది. వైసిపి ప్రభుత్వమూ రాబోయే రోజుల్లో అధికారానికి దూరం కావటం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చంద్రబాబు రాకతో టిడిపిలో ఉత్సాహం

తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు రాకతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వ్యక్తమవుతోంది. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి విడుదలైన అనంతరం తొలిసారి ఉమ్మడి జిల్లా కేంద్రమైన కాకినాడలో నిర్వహించిన సభకు చంద్రబాబు హాజరయ్యారు. వైసిపి నేతల తీరుపై విరుచుకుపడ్డారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు జనసేన, టిడిపి ఉమ్మడి జాబితా విడుదల చేయనున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో అధినేత రాక ప్రత్యేక సంతరించుకుంది. దీంతో జిల్లాలోని పార్టీ ముఖ్యనేతలు అధినేతను కలిసేందుకు క్యూ కట్టారు. ఎవరికీ స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. గత వారంలో జనసేన అధినేత సైతం జనసేన నేతలతో సమీక్షలు నిర్వహించారు. ఆ రెండుపార్టీల సీట్ల సర్దుబాటుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆశావహులంతా తమలో ఉత్సాహాన్ని నింపేలా ప్రకటన చేస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు.

ముగ్గుల పోటీలతో మహిళలకు ఎర

సంక్రాంతి సంబరాల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా నిర్వహించిన రంగవల్లుల పోటీల పేరుతో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన కూటమి మహిళా ఓటర్లకు బహుమతులు ఎర వేయడంపై సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కాసు బంగారం, బైకులు పంపిణీ చేయటం చర్చనీయాంశమైంది. మరి కొద్ది నెల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నాలుగేళ్లలో క్రీడాకారులకు ఎటువంటి ప్రోత్సాహం ఇవ్వని వైసిపి ప్రభుత్వం ఆడుదాం- ఆంధ్రా పేరుతో పలు రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. విజేతలకు నగదు బహుమతులను ప్రకటించడంతో పాటు రూ.100 కోట్ల బడ్జెట్ కేటాయించడం విమర్శలకు దారి తీసింది. మొత్తం మీద ఎన్నికల ప్రకటన ముందే ఓటర్లను ప్రలోభాల ఎరవేసేందుకు ఆయా పార్టీలు పోటీపడుతున్నాయి.

హోమ్ మినిస్టర్ ఇలాఖాలోనూ కోడి పందేలు

సంక్రాంతి నేపథ్యంలో జిల్లాలో కోడి పందేలకు రంగం సిద్ధమవుతోంది. పోలీసు, రెవెన్యూ అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. స్వయానా హోమ్ మంత్రి ఇలాకాలో కోడి పందేలకు బరులు సిద్ధం చేయడం విమర్శలకు దారి తీస్తోంది. ఎస్‌పి జగదీష్ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా పోలీసులు క్షేత్రస్థాయి పర్యటించి పలు బరులు ధ్వంసం చేశారు. ఈ జాబితాలో హోమ్ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొవ్వూరు, అనపర్తి ఎంఎల్ఎ సత్తి సూర్యనారాయణరెడ్డి నియోజక వర్గమైన అనపర్తి లేకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మండలం ఉన్నగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-1997లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయులు ఎ.సూర్యనారాయణ, జి.నాగమణి తదితరులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకున్న పాఠశాలపై మమకారంతో అన్ని విధాలా అభివృద్ధికి సహకరించడం అభినందనీయ మన్నారు. హెచ్ఎం ఎన్‌వి.రమణ మాట్లా డుతూ ప్రభుత్వ పాఠశాలకు ప్రభుత్వం, దాతల సహకారం, పూర్వ విద్యార్థుల ప్రోత్సాహం ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోవడం ఆందోళన కలిగి స్తోందని, ప్రతి విద్యార్థి కుటుంబ సభ్యులు ప్రభుత్వ పాఠశాలలను సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా పాల్గొని ఆటపాటలతో ఆనందంగా గడిపారు. పాఠశాల కమిటీ అధ్యక్షుడు నందిగం శ్రీనివాసరావు, నల్లూరు సూరిబాబు, కె.గోవింద్, కె.సురేంద్ర, ఎ.శివ రామకృష్ణ, కె.నాగేశ్వర రావు, జి.విజయలక్ష్మి, అన్నపూర్ణ, ముప్పరాజు వెంకట రమేష్ పాల్గొన్నారు

కోరమండల్ ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ

కాకినాడ రూరల్ : ఎపిఐఐసి కాలనీలో కోరమండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నూతన వస్త్రాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ కార్యదర్శి మల్లీశ్వరి మాట్లాడుతూ తమ క్లబ్ అధ్యక్షురాలయిన వెంకట దుర్గావతి సూచనల మేరకు ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. సమాజ సేవలో ప్రధానమైనది మానవ సేవ అని వీటితోనే భగవంతుని అనుగ్రహం లభిస్తుందని అన్నారు. ఒకరికి చేసిన ఉపకారమే మనిషికి మిగిలే నిజమైన సిరి అని అన్నారు. పరులకు మేలు చేయాలనే సంకల్పం ప్రతి ఒక్కరిలో కలగాలని అన్నారు. మనకు అతి ముఖ్యమైన పండుగ సంక్రాంతి అని మహిళలందరూ నూతన వస్త్రాలు ధరించి ఆనందంగా సంతోషంగా ఉండాలనే భావనతో నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్నామని మల్లీశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, విజయలక్ష్మి, పద్మ, చింతపల్లి సుబ్బారావు, రాజా, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్

కరప : మండల కేంద్రం కరపలో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ కరప(సిఎకె) ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. శనివారం కరప జడ్‌పి ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన రెండవ రోజు క్రికెట్ పోటీలను జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవు మధువీరేష్ టాస్ వేసి ప్రారంభించారు. రెండోరోజు ఏడు మ్యాచ్‌లు జరిగాయి. మొదట మ్యాచ్‌లో భీమ్ వారియర్స్ కరప, వేములవాడ జట్ల మధ్య పోటీ జరగగా భీమ్ వారియర్స్ కరప గెలుపొందింది. పెద్దాపురప్పాడు, సిరిపురం జట్ల మధ్య రెండో మ్యాచ్ లో వికెట్ నష్టపోకుండా పెద్దాపురప్పాడు విజయం సాధించింది. మూడో మ్యాచ్లో బావవరం సూపర్ కింగ్స్, నాలుగో మ్యాచ్లో గురజనాపల్లి-3, ఐదో మ్యాచ్ లో కరప మెరక వీధి, ఆరో మ్యాచ్ లో గురజనాపల్లి-3, ఏడో మ్యాచ్ లో వేళంగి-2 జట్లు తమ ప్రత్యర్థి పెద్దాపురప్పాడు, కరప లెవెన్, జెడ్ బావవరం, బీమ్ వారియర్స్ కరప, గురజానపల్లి-2 జట్లులపై విజయం సాధించాయి. పాట్నీడి సత్య భీమేశ్వరరావు (భీమన్న), బండారు మురళి, నిర్వాహకులు నక్కా భీమ్, గోన శివ, దేవు శివ, సిఎకె ఫ్రెండ్స్ లెవెన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలోకి చేరికలు

ప్రజాశక్తి - శంఖవరం

మండలంలోని కత్తిపూడి గ్రామానికి చెందిన వైసిపికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరారు. కత్తిపూడి గ్రామానికి చెందిన యర్రంశెట్టి సత్యనారాయణ (బాబ్జి) గృహంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సత్యప్రభ పాల్గొన్నారు. టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా శివ నేతృత్వంలో వైసిపికి చెందిన నాయుడు ఈశ్వరరావు, నాయుడు బుజ్జి, గౌతు దొరబాబు, రౌతు శివ, గౌతు కృష్ణారావులతో పాటు సుమారు వంద మంది టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ టిడిపి కండువాలు కప్పి వరుపుల సత్యప్రభ ఆహ్వానించారు. అనంతరం వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనపై ప్రజలు విసుగు చెందారని, రాష్ట్ర అభివృద్ధికై ఒక విజన్, లక్ష్యం గల నేత చంద్రబాబు నాయుడు ఒక్కరేనన్నారు. రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన పార్టీలు విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ తరుణంలోనే. టిడిపిపైన, తనపైన నమ్మకంతో పార్టీలో చేరిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపి, పార్టీ అభివృద్ధికి కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి బచ్చల గంగ, టిడిపి నేతలు కీర్తి సుభాష్, బద్ది రామారావు, రమణ, ఓలేటి లక్ష్మీనారాయణ, అరిగెల జగదీష్, గాబు కష్ణ, సరమర్ల మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

శృంగార వల్లభ స్వామికి రూ 1.7 లక్షలు ఆదాయం

పెద్దాపురం : మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ.1,19,360, అన్నదాన విరాళాల ద్వారా రూ.47,122, కేశఖండన ద్వారా రూ.4,240 ఆదాయం సమకూరుందని ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహార ప్రసాదం ,మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులకు అర్చకులు పెద్దింటి నారాయణచార్యులు, పురుషోత్తమాచార్యులు, ఆలయ ఛైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ధర్మకర్తలు, ఎంపిటిసి సభ్యులు కుంచే బుచ్చిరాజు, ఆలయ సిబ్బంది కృష్ణ, రమేష్, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు అంజనీ కుమార్, గ్రామస్తులు సేవలందించారు.

కోడి పందేలకు బరులు సిద్ధం

సామర్లకోట రూరల్ : ఒకవైపు పోలీసులు హెచ్చ రికలు జారీచేసినప్పటికి, అనుమతులు చివరి క్షణంలో అయి నా వస్తాయని ధీమాతో పందాల నిర్వహణకు సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు నిర్వాహకులు చేస్తు న్నారు. సంక్రాంతి పందాలకు కోడి పుంజులు సై అంటూ కాలు దువ్వుతు న్నాయి. పందాలకు తయారు మచేసే పుంజుల జాతి, రంగులను బట్టి వేలాది రూపా యలు వెచ్చించి పందెం రాయుళ్లు కొను గోలు చేస్తారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే సంక్రాంతి పండుగకు సంభందించి కోడిపందాల బరులు సిద్ధం అయ్యాయి. అధికార ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు, నాయకుల ఆధ్వర్యంలో పండగ మూడు రోజులూ కోడి పందాలు నిర్వహిస్తారు. ఇప్పటికే కోడిపందాల బరు లలో పందాలతోపాటు మద్యం దుకాణం, బిర్యానీ పాయింట్, గుండాట, కూల్ డ్రింక్స్ పాయింట్, తినుబండారాల పా యింట్లకు వేలం పాటలను నిర్వహిం చినట్లు సమాచారం. కోడిపందాలు నిర్వ హిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శని వారం సామర్లకోటలో జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్ హెచ్చరించారు. పోలీసు వర్గాలు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ నిర్వాహకులు తమ పనిలో నిమగ్న మయ్యారు. మొత్తం మీద పోలీస్ హెచ్చరికలు ఎంత వరకు పాటిస్తారో వేచి చూడాలి.

ఘనంగా సంక్రాంతి ఆటల పోటీలు

పెద్దాపురం : డివైఎఫ్ఐ, సిఐటియు, ఐద్వా, ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సంక్రాంతి ఆటల పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వాహక కమిటీ సభ్యులు సిరపరపు బంగారు రాజు, రొంగల అరుణ్‌కుమార్‌లు మాట్లాడుతూ యువతను సంక్రాంతి పర్వదినాల్లో వ్యసనాలకు, జూదాలకు, అశ్లీలతకు దూరంగా ఉంచేందుకు ప్రతి ఏడాది ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం శోభా థియేటర్ ప్రాంతంలో ముగ్గులు పోటీలు నిర్వహించామన్నారు. శోభా థియేటర్, నువ్వుల గుంట వీధి, సుందరయ్య కాలనీ, సత్తమ్మ కాలనీలలో రెండు రోజులపాటు ముగ్గుల పోటీలు, యువతీ, యువకులకు, బాలలకు పలు రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. శోభాథియేటర్ వీధిలో నిర్వహించిన ముగ్గుల పోటీలను అమత, నమ్రత, గౌస్, బంగారు రాజు, అరుణ్, పూజిత, సుబ్బలక్ష్మి, వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

జ్యోతుల ఆధ్వర్యంలో పలువురు టిడిపిలో చేరిక

సమావేశంలో మాట్లాడుతున్న నెహ్రూ

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని జె. కొత్తూరు గ్రామానికి చెందిన పలువురు రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో శనివారం వైసిపి నుంచి టిడిపిలో చేరారు. గ్రామానికి చెందిన చింతల వెంకటరమణ ఆధ్వర్యంలో నకిరెడ్డి కాటయ్య, నక్కన శివయ్య, రాజమండ్రపు స్వామి, చల్లా దుర్గ, ఉంగరాల నాగరాజు, చల్లా శ్రీను, నక్కన నాగరాజు, చల్లపురెడ్డి రమేష్,కందికట్ల రాజేష్, పలువురికి జ్యోతుల నెహ్రూ కండువాలతో పార్టీలోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ టిడిపి మీద, నామీద, నమ్మకంతో టిడిపిలో చేరుతున్న వారందరికీ స్వాగతం పలుకుతున్నానని అన్నారు. అధికార పార్టీపై ఎన్నికల్లో పోటీ చేస్తున్న నరసింహం గత సంవత్సర కాలంగా ఆత్మీయ సమావేశాలతో నియోజకవర్గం అంతా తిరుగుతున్నాడని పుష్కర ఎత్తిపోతల పథకం తాళ్లూరు లిఫ్ట్‌కు నిధులు సమకూర్చి మరమ్మతులు చేసి ఉంటే రైతులందరూ పంటలు పండించుకునే వారిని ఇంతమంది నష్టపోయేవారు కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, పైడిపాల సూరిబాబు, సర్వసిద్ధి లక్ష్మణరావు, దంట పెద్దకాపు, పార్టీ ప్రెసిడెంట్ చింతల కన్నారావు , బద్ధి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

ముగ్గులను పరిశీలిస్తున్న కృష్ణ కల్యాణ్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సంక్రాంతిని పురస్కరించుకొని రమణయ్యపేట మాజీ ఎంపిటిసి రాయుడు అనిల్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు వైభవంగా నిర్వహించారు. శనివారం మండలపరిధిలోని రమణయ్యపేట ఎన్‌టిఆర్ కాలనీలో టిడిపి యువ నాయకులు పిల్లి కృష్ణ కళ్యాణ్ సహకారంతో నిర్వహించిన ముగ్గుల పోటీలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని రంగురంగుల హరివిల్లులు అల్లరింపజేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మీ సత్యనారాయణ కుమారుడు పిల్లి కృష్ణ కళ్యాణ్ మాట్లాడుతూ యువతకు మన సంస్కృతి సాంప్రదాయాలు తెలియజేయాలన్న ఉద్దేశంతో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. తద్వారా గ్రామాల్లో యువత అసంఘిక కార్యక్రమాల వైపు వెళ్లకుండా అందరి కలయికతో గ్రామం కళకళలాడుతుందని, తద్వారా సుహుత్భావ వాతావరణ ఏర్పడి ఆధ్యాత్మిక నెలకొంటుందన్నారు. మహిళలు సాంప్రదాయ ముగ్గులు వేసి మన్ననలు పొందారన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు పాల్గొన్న వాళ్లందరికీ ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుప్తా, మేడిశెట్టి ఏసు, గ్రామస్తులు రాందేవు శ్రీలక్ష్మీ, జి.యశోద, సిహెచ్ దుర్గాప్రసాద్, యాదగిరి సత్యనారాయణ, దండా సత్యనారాయణ, కోరాడ తాతీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వివేకానంద161వ జన్మదినం

వివేకానందుని జయంతిలో సిబ్బంది

ప్రజాశక్తి - గండేపల్లి

స్వామి వివేకానంద 161వ జయంతి ఉత్సావాన్ని పురష్కరించుకుని ఆదిత్య ఇంజనీరింగ్ క్యాంపస్‌లో గ్రాంథాలయ విభాగం ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుతగా వివేకానంద చిత్రపటానికి క్యాంపస్ డైరెక్టర్ మరియు ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి పూల మాల వేసి నివాలులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వామి వివేకానంద కొన్ని సంవత్సరాలు మాత్రమే జీవించి ఉన్నప్పటికీ యావత్ ప్రపంచంలో గల మానవజాతికి అమూల్యమైన భావజాలాన్ని అందించి చిరంజీవిగా అందరి హృదయాలలో నిలిచారని కొనియాడారు. రాజమహేంద్రవరం శ్రీరామకృష్ణ మఠం స్వామిజీ స్వామి సేవ్యానంద పాల్గొని వివేకానందుని జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాలను విద్యార్థులకు ఉపాధ్యాయులకు అందించి వివేకానందుని గురించి అందరూ తెలుసుకుని ఆయన మార్గాన్ని అనుసరించాలని సూచించారు. ఈ కార్య క్రమంలో డీన్ అడ్మినిస్ట్రేషన్ ప్రొఫెసర్ వి.సత్య నారాయణ, గ్రంథాలయ శాఖ ప్రధాన అధికారి కె.అశోక్ కుమార్, పెదబ్రహ్మదేవం శ్రీ శారద రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్, గ్రంథాలయ సి బ్బంది సోమరాజు, రమ్య, గిడుతూరి వెంకటేష్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే బిజినెస్ స్కూల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ కె.విజయభార్గవి, ఎంబిఎ విభాగం అధిపతి డాక్టర్ ఎం.గోవర్ధన్, ఫిజికల్ డైరెక్టర్ ఎం.ధర్మరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

పోలీసులకు ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి - యానాం

యానాం పోలీసుశాఖ పరిధిలోని వివిధ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 87 మంది పోలీసులకు స్పెషల్ గ్రేడ్ పదోన్నతులు కల్పిస్తూ పోలీసుశాఖ అండర్ సెక్రటరీ ఎంవి.హిరణ్ జాబితా విడుదల చేశారు. వేతనం పెంపుతో ప్రమేయం కల్పించిన పోలీసు ఉన్నతాధికారుల నిర్ణయంలో హెడ్ కానిస్టేబుల్‌గానూ, 15 ఏళ్లు దాటిన ఎఎస్ఐ, 25 ఏళ్లు దాటిన ఎస్ఐగా పదోన్నతి కల్పించారని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో యానాం పోలీసుశాఖలో పనిచేస్తున్న జెబివి.స్వామి, ఎస్.అప్పారావు, డి.చిట్టిబాబు, కె.సుబ్రహ్మణ్యం, పి.జితేష్‌కుమార్, డివిఎల్ సీతారత్నం, కెవి.రమణమూర్తి, డి.పట్టాభి రామయ్య, జెబివి.సుబ్బారావు, పి.సత్య నారాయణ, పి.సుబ్రహ్మ ణ్యేశ్వరరావు, సంపత్ కుమార్ తదితరులకు ఎస్ఐలుగా, కోన సర్వేశ్వరరావు తదితర 33 మందిని ఎఎస్ఐలుగా, 42 మందికి హెడ్ కానిస్టేబుల్లుగా పదోన్నతి కల్పించినట్లు చెప్పారు. సంక్రాంతి పండగ రోజుల్లో వారు పదోన్నతి పొందడం సంతోషకరమని అన్నారు. వీరికి బంధుమిత్రులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - సీతానగరం

సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం సీతానగరం కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో జనసేన పార్టీ రాజానగరం ఇన్‌ఛార్జ్ బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రెండు వందల మంది మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. యువనాయకుడు తోట పవన్ కుమార్ సమక్షంలో విజేతలను ఎంపిక చేసి బహుమతులను ప్రదానం చేశారు. బహుమతుల్లో బంగారు నాణేలు ప్రదానం చేయడం విశేషం. టిడిపి నాయకులు వలవల రాజా, పెందుర్తి అచ్యుత రామయ్య పాల్గొన్నారు.

నిడదవోలు బిఎస్‌పి అభ్యర్థిగా చిత్రసేను

ప్రజాశక్తి-పెరవలి

రానున్న ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ తరపున నిడదవోలు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థిగా గుమ్మాపు చిత్రసేను పోటీ చేయనున్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో చిత్రసేను మాట్లాడారు. తనకు అవకాశం కల్పించిన పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయ్ కుమార్, ఏలూరి అశోక్ కుమార్, నల్లి రమేష్, సత్యనారాయణ, బయ్యే మునేంద్ర, బద్దా జాన్ పాల్గొన్నారు

ముగిసిన మార్నింగ్ స్టార్స్ షటిల్ టోర్నీ

ప్రజాశక్తి - కాకినాడ

ఆఫీసర్స్ క్లబ్ మార్నింగ్ స్టార్స్ షటిల్ టోర్నీ ఉత్సాహంగా ముగిసింది. విన్నర్స్‌గా యు రామకృష్ణ, నవీన్ నిలిచారు. సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం కాకినాడ ఆఫీసర్స్ క్లబ్ లో షటిల్ టోర్నీ నిర్వహించారు. లీగ్ పద్ధతిలో జరిగిన ఈ టోర్నీలో సుమారు 16 జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నీలో రన్నర్స్‌గా తాతాజీ, పీటర్ నిలిచారు. అనంతరం కాకినాడ బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కెబిఎ స్టేడియం నిర్వాహకులు కృష్ణంరాజు చేతులమీదుగా విజేతలకు షీల్డ్‌లు అందజేశారు. ఈ టోర్నీలో ఎఎస్ఐ చౌదరి, గ్రంధి రాజా తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడరూరల్

పేదలకు సిఎం సహాయనిధి భరోసా కల్పిస్తున్నదని ఎంఎల్ఎ కురసాల కన్నబాబు అన్నారు. శనివారం కాకినాడ రూరల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాలకు చెందిన 9 మంది లబ్ధిదారులకు సుమారు రూ.22 లక్షల 20 వేల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం సహాయనిధి పథకం నిరుపేదలకు వరంగా మారుతున్నందన్నారు. ఆరోగ్య శ్రీ సేవల కిందికి రాని శారీరక రుగ్మతలకు ఈ పథకం ఆపన్నహస్తంలా నిలుస్తున్నదని చెప్పారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందాలని ఆయన సూచించారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయం

ప్రజాశక్తి - కోటనందూరు

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ పాండురంగారావు అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలు రాహుల్ గాంధీ సంక్షేమ పాలన కోరుకుంటున్నారని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి అగ్రవర్ణ పేదలు ఇందరమ్మ పరిపాలనతోనే వారికి మేలు చేకూరుతుందనే ఆశాభావంతో ప్రజలు ఉన్నారని అన్నారు. ఇతర పార్టీలపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని అన్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలు పట్టం కట్టారని గుర్తు చేశారు. ఆంధ్ర రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేయడానికి అధిష్టానం కార్యచరణ రూపొందించడం జరుగుతుందని అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి రావడం శుభ పరిణామమని అన్నారు.

ఎంపిటిసి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కోటనందూరు

మండలంలోని అల్లిపూడి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన ఎంపిటిసి సభ్యురాలు నెమ్మది నాగమణి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వైసిపి మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఎంపిపి లగుడు శ్రీనివాస్ మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన మానవతాదృక్పథంతో ఒక లక్ష రూపాయల నగదును కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ లంక ప్రసాద్, గరిసింగు లచ్చరావు, గోవర్ధన, వార్డు సభ్యులు రమణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ముద్రగడను కలిసిన చిన్నయ్య దొర

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

రాష్ట్ర కాపు ఉద్యమ నేత ముద్రగడ్డ పద్మనాభంను రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ అధ్యక్షులు, టిడిపి జిల్లా నాయకులు గోరకపూడి చిన్నయ్యదొర తన బృందంతో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. కాపు ఉద్యమ నేత పద్మనాభం టిడిపి, జనసేన పార్టీల్లో చేరతారా అని వస్తున్న ఊహాగానాల నేపథ్యంలో డాక్టర్ చిన్నయ్య దొరతోపాటు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి తాతపూడి కృష్ణబాబు, జిల్లా కార్యదర్శి కాళ్ళ రవీంద్ర బాబు, జిల్లా బిసి సెక్రెటరీ గోల్తీ సత్యనారాయణలు కలిశారు.

దస్తావేజు పోయినది

నా క్లయింట్లు అయిన కాకినాడ, సాంబమూర్తి నగర్, జ్యోతుల కాలనీ, డో.నెం. 16-33-94రు కాపురస్తులు **(లేటు) మహమ్మద్ చాన్ భాషా గారి కుమారులు అయిన 1) షేక్ అహమద్ మరియు 2) షేక్ అక్టర్ గార్లు** నాకు ఇచ్చిన సంజాయిషీమేరకు యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా.

తూర్పుగోదావరి జిల్లా (ప్రస్తుతం కాకినాడ జిల్లా), కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ సబ్-రిజిస్ట్రీలో చేరిన, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, సాంబమూర్తి నగర్, జ్యోతుల కాలనీ, వార్డు నెం. 2, బ్లాకు నెం. 11, ప్రజెంట్ బ్లాకు నెం. 16, టి.ఎస్. నెం. 835/2, 836/8 దాఖలా 112 చ॥గ॥లు లేక 93.64 చ॥మీ॥లు స్థలం, అందుల డో.నెం. 16-33-94రు గల ఇల్లు నా క్లయింట్లు యొక్క తండ్రి గారు కొనుగోలు చేసి, వారి జీవితకాలంలో నా క్లయింట్లుకు దఖలుపరచి ఉన్నారు. సదరు ఆస్తి తాలూకు లింకు దస్తావేజు అనగా నా క్లయింట్లు తండ్రిగారికి క్రియపర్చిన గంగాపాత్రుని జగదీశ్వరి పేరగల ది.28-07-1998 తేదీగల ఒరిజినల్ క్రియ దస్తావేజు నెం.4722/1998, SRO, కాకినాడను, నా క్లయింట్లు ది. 09-01-2024 తేదీన హౌసింగ్ లోన్ నిమిత్తం వారి ఇంటి వద్ద నుండి కాకినాడ, సూర్యారావుపేటలో గల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్దకు మోటార్ సైకిల్‌పై వెళ్ళుచుండగా, దారి మార్గంలో సదరు దస్తావేజు గల కవరు పడిపోయినది. కావున సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

ఇఫ్తేఖార్ మహమూద్, అడ్వకేట్
డో.నెం. 5-2-43/1ఎ, మాదిరెడ్డివారి వీధి,
కాకినాడ. సెల్: 9848424875